
# మనిషి చచ్చిపోయాడు

పాలడుగు వెంకటేశ్వరరావు




సూర్యుడు మండి పోతూన్నాడు. ఆకాశంలో పూరికి పెడగా వున్న ఆ ఆఫీసు ముందు ఒక పెద్ద చింత చెట్టు వుంది. ఆ చింతచెట్టు క్రిందొక కాకా హొటల్ వుంది. ఆ హొటల్ ముందు బల్లల మీద కూర్చుని వేడి వేడిగా పకోడీలు తింటూ, టీలు తాగుతున్నారు, ఆఫీసు జవానులు లంచ్ ఇంటర్వల్ అవగానే కాకా హొటల్ ఖాళీ అయింది. రోడ్డు మీద పోతూ ఎండకి జడిసి, ఇన్ని మంచి నీళ్ళు-తాగుదామనొచ్చి కూర్చున్న, ఒకరిద్దరు పాసింజర్లు మిగిలారు. బరువుగా అడుగులు వేసుకుంటూ హొటలు దగ్గరికి వచ్చి, ఉస్సురంటూ కూర్చుని, బరువుగా నిట్టూర్చాడు, నాగయ్య. నాగయ్య మొహం నిండా చమట పట్టి వుంది. కాళ్ళకి ఎర్రగా దుమ్ము పట్టివుంది. కళ్ళనిండా నిరాశ గూడు కట్టుకుని వుంది. చూపుల్లో దిగులు వుంది. కండువాతో మొహాన్నపట్టిన చమటని తుడుచుకున్నాడు నాగయ్య.

కుండలోంచి గ్లాసునిండా చల్లని మంచి నీళ్ళు తెచ్చి, నాగయ్యకి అందిస్తూ, 'నాగయ్యా! ఇదేనా రావటం?' అని అడిగాడు, హొటల్ ప్రొప్రయిటర్, కం సర్వర్, కం క్లీనర్, కం కుక్, కుప్పసామి.

'ఆఁ కుప్పస్వామీ! బాగా వుండావా?' – అని గ్లాసు అందుకుని నీళ్ళు గటగటా తాగేశాడు నాగయ్య–

'ఇంకా కావాలా?'

తల వూపాడు, కావాలని నాగయ్య.

ఇంకొక గ్లాసుడు నీళ్ళు గొంతులో పోస్తేగాని, నాగయ్య దాహం తీరలేదు.

ఏమన్నా తింటావా? తీసుకురానా?'

వద్దులే. వుప్పటికే నీ బాకీ ముప్పయి రూపాయలయింది.

'అయితే అయిందిలే నీ బిల్లు వచ్చాక, బాకీలు తీర్చవా ఏంటీ? రోజులు ఎల్లకాలమూ ఒక్కలాగే వుండవులే నాగయ్యా.'

'కుప్పసామీ! ఆఫీసుకి వెళ్ళి పని చూసుకుని వస్తానయ్యా. పనయిన తర్వాత వచ్చి, ఏమన్నా తింటాలే!' అని లేచి ఆఫీసు వయిపుకి సాగిపోయాడు నాగయ్య.

ఆ బిల్లు కోసం అక్కడికి నాగయ్య రావటం అది ఇరవయ్యోసారి. ఎంతో ఆశతో వస్తాడు. నిరాశతో క్రుంగిపోయి తిరిగి వెళ్ళి పోతాడు. ఆశపట్టి లాగుతోంది. నిరాశ క్రుంగదీసి నడుం విరగ్గొడుతుంది. ఆశ నిరాశల మధ్యన నలిగి పోతూ మగ్గంలో కండెలాగా తిరుగుతాడు నాగయ్య. నాగయ్యది, అక్కడికి పదిహేను మైళ్ళ దూరంలో వున్న పల్లెటూరు. ఆ వూర్నించి ఇక్కడికి రావాలంటే రెండు బస్సులు మారాలి. నానా అవస్థపడి రావాలి. వూరికి ప్రక్కనే వుందిగదా అని, ఆ ఆఫీసు ఆధ్వర్యంలో ఒక చిన్న వంతెన నిర్మాణాన్ని చేపట్టాడు నాగయ్య. పని యొక్క విలువ రెండున్నర వేల రూపాయలు వడ్డీకి అప్పుతెచ్చి నాలుగు రూపాయలు మిగుల్తాయ్యన్న ఆశతో, కష్టపడి పని పూర్తి చేశాడు. పని పూర్తయి పదిహేను

నెలలయింది. లేబరు మోసం చేశారు రెండువేలు వదిలేస్తేగాని పనవలేదు ఆ అప్పు మీద వడ్డీ పాపంలాగా పెరిగి పోతూ వుంది. అందు వలన, బిల్లు తీసుకుని అప్పు తీర్చేసి, చేతులు కడుక్కుందామని, కాలికి బలపం కట్టుకుని తిరుగుతున్నాడు నాగయ్య. మిగలకపోతే, పోయింది చేతులు కాలకుండా బయట పడితే, అదే పదివేలు! ఇంటి దగ్గర పెద్ద సంసారం, చాలీ చాలని ఆదాయం వుక్కిరి బిక్కిరి చేసే ఖర్చులు. ఆ పయిన, క్రింది మధ్య తరగతి' మనస్తత్వాల ఆరాట పోరాటాలు పిల్లలకి నచ్చచెప్పటం చాలా కష్టంగా అన్పిస్తుంది. ఇంటి ఇల్లాలిది పెద్దచెయ్యి. అర్జనకీ ఖర్చులకీ ఎక్కడా పొంతన కుదరటం గగనంగా అవుతుంది. అయోమయంగా వుంది.

తన కష్ట సుఖాలన్నీకుప్పుసామికి ఏకరువు పెట్టి, నిట్టూరుస్తాడు నాగయ్య. పొట్ట చేత పట్టుకుని రాష్ట్రం ఎల్లల్ని దాటి వచ్చిన కుప్పుసామి ఆలోచనల తీరే వేరు. నాగయ్యకి లౌకికం తెలీదని విచారిస్తాడు కుప్పుసామి.

'బరువు.' బరువు కావాలి. ఈ రోజుల్లో బరువు పెట్టందే కాగితాలు కదలవు. టీ తాగటానికి వచ్చి, కబుర్లు చెప్పుకుంటున్న జనం మాటల్ని బట్టి కుప్పుసామి సర్వం గ్రహించాడు. వ్యవహారాల తీరు తెన్నుల్ని ఆకళింపు చేసుకున్నాడు.

'నాగయ్యా! ఇంత అమాయకుడివి! పరిస్థితుల్ని ఇప్పటికయినా గ్రహించవు. నువ్వు ఎట్లా బ్రతుకుతున్నావయ్యా ఈ లోకంలో!'- జాలిగా అంటాడు కుప్పుసామి.

'నాకు అర్థంగావటం లేదు కుప్పుసామీ!'

'నాగయ్యా. అసలు కంటే వడ్డీ ముద్దు. జీతం కంటే లంచమే ప్రియాతి ప్రియమయింది న్యాయంగా మిగిలిన లాభం కంటే, నీళ్ల కాఫీలిచ్చి, సంపాదించిందే అపూర్వమయినది! వైటుమనీకంటే బ్లాకు మనీ ఎంతో ముచ్చటగా అన్పిస్తుంది. ఈ రోజు - ఇదయ్యా మన పద్ధతుల తీరూ.!'

'అండే?!'

'మన వ్యవస్థ బాగా కుళ్లిపోయింది. కుష్టు రోగంతో చెడిపోయి వుంది.'

-బాగు చేసుకొనటాన్కి ప్రయత్నించాలి, మనం. జనం మారాలి. మనం మారాలి. దేశం మారాలి.

'భేష్ బాగానే వుంది నాగయ్యా. కానీ, ఎవరయ్యా ఈ జనాల్ని మార్చగలిగేదీ?'

'మనమే!'

'చాలా బాగుంది. అంతటి బాధ్యతలు మోయ్యటానికి మనమెంతటి వారం? మన ఓపిక ఏపాటిదీ?'

'అలా అనుకోకూడదు. ఈ బాధ్యత మనలో ప్రతీ ఒక్కరిదీనూ. కాదనగలమా?'

'నాగయ్యా. మన సంభాషణ దారి తప్పుతూ వుంది. పాయింట్‌కొస్తాను. నీ బిల్లు పాసయి నీకు డబ్బు అందాలంటే, నువ్వు ఇన్నిసార్లు తిరగనవసరం లేదు. ఒక రెండు వందలు, శంభులింగం మొహాన్న కొట్టి ఇంటి దగ్గర కూర్చో. అంతే.



'నేను గాంధీగారి శిష్యుణ్ని. ఆ పని ఛస్తే చెయ్యను, కుప్పుసామీ'

'అయితే నీ బిల్లు రాదు. కావాలంటే రాసిస్తాను-స్టాంపు పేపరు కొని తెచ్చుకో.'

'చాలా అన్యాయంగా మాట్లాడుతున్నావు కుప్పుసామీ. న్యాయం అంటూ వుండాలి. పాప పుణ్యాలు వున్నాయి.'

'నీకు అన్యాయం జరగడం చూడలేకే, నేను నోరు తెరచి చెప్పాల్సి వచ్చింది నాగయ్యా. ఇలాగ పిచ్చిగా తిరుగుతూ, బిల్లు చేతికి రాక, ఆ వడ్డీ అలాగ పెరిగిపోయి, చివరికి ఏమవుతుందో నీకు తెలుసా, నాగయ్యా! ఆలోచిస్తున్నావా లేదా?'

నాగయ్య గమ్మునుండి పోయి శూన్యంలోకి చూస్తాడు. దిగులుగానిట్టూరుస్తాడు

నాగయ్యని గురించిన ఆలోచనల్తో నిలబడిపోయిన, కుప్పుసామి కస్టమర్ రాకతో ఈ లోకంలోకి వచ్చాడు.

'ఏయ్! కుప్పుసామీ! కాఫీ ' శంభులింగం పళ్లికిలిస్తూ, బల్లమీద కూర్చుని కాలరు సర్దుకున్నాడు. గండు మొహం. బండ పెదాలు. లావుపాటి జాంకాయ ముక్కు. చికిలి కళ్ళు. ఎత్తు పళ్ళు. ఏనుగు యొక్క చెవులు. వేషం వేసి నిలబెడితే మారీచుడులాగా వుంటాడు శంభులింగం.

శంభులింగానికి కాఫీ కలిపి ఇచ్చి-'శంభులింగంగారూ! నాగయ్య వచ్చాడు; కనపడలేదా?' అని అడిగాడు కుప్పుసామి. శంభులింగం వికటంగా నవ్వి'- వచ్చాడయ్యా. సుత్తి కేసు. అబ్బ ఆ బోరు పడలేకే నేను ఇలా పరుగెత్తుకుని వచ్చాను' అన్నాడు.

## బురద

ఎదుటి వాడిపై
బురద
చల్లాలనే
దురాలోచనలో –
తన చేతికే
ముందా బురద
అంటుతుందన్న
అసలు నిజాన్ని–
మరచి పోతుంది
మనిషిలోని
మూర్ఖత్వం!

– కొల్లూరి రంగారావు

'పాపం! అమాయకుడు. ఇంక చాలు గాని అతని పని చేసి పంపించండి'

'కుప్పుసామి! నాగయ్య సంగతి నీకేం తెలుసయ్యా? ఎంతసేపూ గానుగెద్దులాగా తిరగటమే గాని, దారికి రాడు గదా' అప్పటికీ సిగ్గు విడిచి చెప్పాను కూడా వినిపించుకుంటేనా? పెడసరం మనిషి

'అతని తత్వం అది. పాలిచ్చే నాలుగు గేదెల్లో, ఒకటి వట్టిపోయిందనుకుని అతన్ని వదిలించుకోగూడదా? అది న్యాయం గదా'

'అది నా తత్త్వమే కాదు కుప్పుసామీ! పద్ధతి పద్ధతే మరి! నేను చాలా స్ట్రిక్టు మనిషిని'

'ఇది చాలా అన్యాయం లింగం బాబూ! ఆ అమాయకుడు అన్యాయమయిపోతాడు. ఆ పాపం మూట గట్టుకుంటావా?'

'కుప్పుసామి! ఇంక చాలు ఇప్పటికే అధిక ప్రసంగం అయింది' అని దులపరించుకుని వెళ్లిపోయాడు శంభులింగం '

ఆ సాయంత్రం, ఆఫీసు నిర్మానుష్యం అయిపోయాక, నీరసంగా వచ్చి హోటలు బల్ల మీద కూర్చున్నాడు నాగయ్య

'నాగయ్యా! పని ఎంత వరకు అయింది?' అని కుప్పుసామి అడిగాడు.

నాగయ్య సమాధానం చెప్పలేదు.

'అన్నా! ఈ రాత్రికి నన్ను ఇక్కడ పడుకోనిస్తావా?'- చాలాసేపటికి నోరు పెగల్చుకుని, దీనంగా అడిగాడు నాగయ్య

'అదేమంత భాగ్యం! అలాగే వుండు నాగయ్యా '

బలవంతం చేసి, తను వండుకున్నదాంట్లో, ఇంత పెట్టి నాగయ్యకి కూడా బల్లమీద ప్రక్క వేశాడు కుప్పుసామి.

ఆఫీసరుగారు కేంపు నుంచి రేపు వస్తారట ఆయన్ని కలిసిగాని తిరిగి వూరికి పోడు నాగయ్య అప్పు ఇచ్చిన షావుకారు గొంత మీద కూర్చున్నాడట. ఎలాగయినా సరే బిల్లు తీసుకుని, ఆ బాకీ తీర్చెయ్యకపోతే వూళ్లో, పరువు నిలిచేటట్టు లేదు. అసలే సంసారం ఆర్థికంగా చితికిపోయి వుంది కొడుకులు, చెప్పిన మాట వినకుండా ఎదురు తిరుగుతున్నారు వాళ్లకి సరయిన చదువులు చెప్పించలేకపోయాడు. కట్నం తేలేదని మొగుడు కొట్టి తరిమేయగా, పెద్ద కూతురు పుట్టిల్లు చేరింది. ఆ తర్వాత పిల్ల, పెళ్లికి ఎదిగి వచ్చి కూర్చుని రెండేళ్లయింది తుఫానులకి రెండేళ్లనుంచీ వ్యవసాయం నడుం విరింది వ్యాపారంలోకి దిగాడు దాని చందం ఇలాగయింది సంసారం బేలన్సు తప్పింది. బండి, చక్రాలు వూడిపోయి కూలిపోయే దశలో వుంది మొదటి నించి నీతి నిజాయితీతో బ్రతికాడు. దేశానికి స్వాతంత్ర్యం తేవటానికి లాఠీ దెబ్బలు తిని జైలుకి వెళ్లాడు బ్రతుకు బాటకి యాపు రేఖలు దిద్దుకోవలసిన సమయంలో, స్వార్థాన్ని అవతలకి త్రోసి, అమూల్యమయిన సమయాన్ని, దేశం కోసం అర్పించాడు ఉద్యమ ప్రవాహంలో పడి కొట్టుకునిపోయి, చివరికి వడ్డునబడేసరికి, సమస్యలు చుట్టు ముట్టాయి

## విజేతలైన 'శ్రీ శ్రీ వారసులు'

మహాకవి శ్రీశ్రీ స్మృతి చిహ్నంగా 'సాంస్కృతీ సమాఖ్య' (యువ సాహితీ వికాస వేదిక) ఆంధ్రప్రదేశ్‌వారు నిర్వహించిన 1984 వ సంవత్సరం కవితల పోటీలో రాష్ట్ర వ్యాప్తంగా యువ కవులు పాల్గొన్నారు. భాష, భావం, శైలి, శిల్పం, ప్రయోజనం అన్న అంశాల కనుగుణంగా రచనలను విశ్లేషణ చేసిన న్యాయ నిర్ణేతలుగా సర్వశ్రీ ఆరుద్ర, ఆవంత్స సోమసుందర్, అద్దేపల్లి రామమోహనరావుగార్లు వ్యవహరించారు.

ప్రథమ బహుమతి . శ్రీ కళ్యాణ రామచంద్ర – హైదరాబాదు (వీలునామా), శ్రీ ముదివేడు ప్రభాకరరావు – తిరుపతి (సామాన్యుడు రక్షకుడైతే), శ్రీ కొల్లూరి వెంకటేశ్వర్లు – తెనాలి (శవ సంభగులు)

ద్వితీయ బహుమతి : శ్రీ తియ్యగూర సీతారామిరెడ్డి – మోదుకూరు (నాలో నేనే), శ్రీమతి చిల్లర భవానీ దేవి – హైదరాబాదు (సృష్టిలో మనిషి), కుమారి ఓదనాపురం భారతి – హైదరాబాదు (వంచనాశిల్పం)

**తృతీయ బహుమతి : శ్రీ కొణకంచి రామకృష్ణ** – ఖమ్మం (వీరలక్షణం), కుమారి అన్నే విజయశ్రీ – ముదునూరు (వేదనా విజృంభణ)

సమాఖ్య దశాబ్ది కాలంలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన వారి సంఖ్య వీరిలో 128 అయినట్లు, ఈ పోటీలో పాల్గొన్న కవులందరికీ సమాఖ్య ధృవీకరణ పత్రాలు పంపించినట్లు సమాఖ్య రాష్ట్ర కమిటి ప్రధాన కార్యదర్శి శ్రీ వి. శిరీష్‌కుమార్ తెలియ చేస్తున్నారు.

# అవీ ఇవీ అన్నీ

## "మధుర" ఆవిష్కరణోత్సవం

సాహితీ సమితి, వరంగల్లు వారి ఆధ్వర్యంలో ఇటీవల వర్ధమాన కవి, సమీక్షకుడు అయిన శ్రీ టి. శ్రీరంగస్వామిగారి 'మధుర' కవితా సంపుటి ఆవిష్కరణోత్సవం జరిగినది. సుప్రసిద్ధ విమర్శకుడు, సాహితీవేత్త డా కోవెల సంపత్కుమారాచార్య సంపుటిని ఆవిష్కరించారు. అష్టావధాని శ్రీ ఐ. కిషన్‌రావు సభకి అధ్యక్షత వహించారు. శ్రీ కె. ఎస్. ఆర్. జి. ప్రసాద్ రచయితకు శాలువతో సత్కారం చేశారు.

మధుర కవితా సంపుటిని పరిచయం చేస్తూ శ్రీ వరిగొండ కాంతారావు, శ్రీశ్రీ దాస్యం లక్ష్మయ్య, శ్రీ యం. రత్నాకరరావు, కుమారి భండారు విజయగార్లు ప్రసంగించారు. శ్రీ టి. శ్రీ రంగస్వామి తమ గురువు శ్రీ వరవరస్వామిని సత్కరించారు.

ఈ సభకు ముఖ్య అతిథిగా వచ్చిన శ్రీ వి. వెంకటప్పయ్య కవి యొక్క సాహితీ సేవను కొనియాడారు.

శ్రీ మనోహరాచారి, శ్రీ తాళ్లపల్లి రామస్వామిగార్లు కవిని పూలమాలాలంకృతులను చేశారు. ప్రముఖ కవి శ్రీ కాళోజీగడ్డ సందేశాన్ని శ్రీ శ్రీనివాసరావు చదివి వినిపించారు. రచయిత ఉచిత రీతిని తన కృతజ్ఞతలు తెల్పుకున్నారు. సమావేశానికి **తొలుత** సంస్థ అధ్యక్షులు శ్రీ నమిలికొండ బాలకిషన్ **స్వాగతం** పలుకగా, సంయుక్త కార్యదర్శి శ్రీ నిధి **కృతజ్ఞతలు** చెప్పారు

## నెల్లూరులో అక్కినేని జన్మదినోత్సవం

నెల్లూరు అక్కినేని ఆర్ట్సు అసోసియేషన్‌వారు శ్రీ అక్కినేని నాగేశ్వరరావు జన్మదినోత్సవాన్ని, నెల్లూరు టౌన్ హాలులో అతివైభవంగా జరుప నిశ్చయించినారు. ఈ సందర్భంగా సెప్టెంబరు 19, 20 తేదీలలో అఖిల భారత స్థాయిలో ఏక పాత్రాభినయం, జానపద నృత్యములు, రికార్డు డ్యాన్సులలోను మరియు శాస్త్రీయ సంగీతం, లలిత సంగీతం, సినిమా పాటలలోను పోటీలు నిర్వహిస్తారు. పై పోటీలకు న్యాయ నిర్ణేతలుగా, సినీ నృత్య దర్శకులు, సినీ సంగీత దర్శకులు వ్యవహరింతురు వివరములకు- సెక్రెటరీ, అక్కినేని ఆర్ట్సు అసోసియేషన్, నియర్ అనితాహోల్, నెల్లూరు-534 003కి రాయాలి ☐

---

సంసారం గుదిబండలాగా అయింది ఉక్కిరిబిక్కిరిగా వుంది.

తన సొదంతా, ఆ రాత్రి పూట, బల్ల మీద పడుకుని, కుప్పుసామిని చెప్పుకున్నాడు, నాగయ్య. ఆ వుండటం తనకి చేతనయిన విధంగా, నాగయ్యకి ధైర్యం చెప్పి, అతన్ని ఓదార్చి, నిట్టూర్చాడు కుప్పుసామి ఆ వుండటం నాలుగు రోజులు వుండాల్సి వచ్చింది. నాలుగోనాడు, ధాం ధాం అంటూ ఆఫీసుకి వచ్చాడు ఆఫీసరు.

అది తెలిసి కొండంత బలం రాగా, ఆఫీసరుని కలవటానికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిన, నాగయ్య కోసం నిరీక్షించాడు కుప్పుసామి. ఆ పగలల్లా ఆఫీసులోనే వుండిపోయాడు నాగయ్య. కుప్పుసామికి కనపడనేలేదు. ఏమయిందోనని ఆత్రంగా ఎదురు చూసిన కుప్పుసామికి ఏ కబురూ తెలియలేదు.

చీకటి పడింది.

'ఏమయ్యాడబ్బా మనిషి?' అని, చాలాసార్లు అనుకున్నాడు కుప్పుసామి.

భోజనం చేసి, బల్ల మీద పక్క పరచుకుంటూ, నాగయ్య గురించే విచారంగా ఆలోచనలు చేసాడు. బలవంతాన పడుకుని కంటి మీదకి నిద్ర తెచ్చుకోవటానికి చాలాసేపు ప్రయత్నించాడు.

'కుప్పుసామీ! కుప్పుసామీ!' నాగయ్య పిలుపుకి ఉలిక్కి పడి లేచి కూర్చున్నాడు. కుప్పుసామి.

'నాగయ్యా! ఏమయిపోయావ్?! దా. కూర్చో.' ఆదరంగా అన్నాడు కుప్పుసామి.

'కాదులే. నేను వెళ్లిపోతున్నా.'

'ఏమయింది, నీ పని?'

## మనిషి చచ్చిపోయాడు

'ఇదుగో. నీ బాకీ క్రింద ఈ గడియారం వుంచుకో. చాలా పాతది అనుకో. అయినా ముప్పయి రూపాయలు చేస్తుందిలే. సరిపెట్టుకో కుప్పుసామీ'

'నీ పని ఏమయిందంటే, బాకీ సంగతి మాట్లాడతావేమయ్యా?!'

పదే పదే కుప్పుసామి రొక్కించిన మీదట, జరిగిన సంగతి చెప్పాడు నాగయ్య.

ఆసలు, ఆఫీసరూ శంభులింగమూ ఒకటి! శంభులింగం చెవిలో ఏదో చెప్పగా విని, ఆఫీసరు ధాం ధాం అని ఎగిరి పడ్డాడు! బిల్లూ లేదు, గిల్లూ లేదు. నీ దిక్కున్నచోట చెప్పుకో- అని కసిరి కొట్టాడు. జవానుని పిలిచి బయటకి నెట్టించాడు నాగయ్యని!

'ధూత్! వీళ్ల బ్రతుకులు తగలబడ!' అని కసి దీరా బూతులు తిట్టాడు కుప్పుస్వామి.

'అన్నా! నేను వెళ్లివస్తాను. ఈ తమ్ముడ్ని మర్చిపోకు' అన్నాడు నాగయ్య గాద్గికంగా పోదువుగానిలే'- అని కుప్పుసామి అంటూ వుండగానే- వెళ్లిపోయాడు నాగయ్య!

నిట్టూర్చి, బూతులు తిట్టుకున్నాడు కుప్పుసామి సరిగా నిద్ర పట్టలేదు. తెల్లవారు జామున కలత నిద్రలో ఆ ఆఫీసు తగలబడిపోతున్నట్టూ, ఆ మంటల్లో శంభులింగమూ, ఆఫీసరూ కాలిపోతూ ఆర్తనాదాలు చేస్తూ దీనంగా విలపిస్తూ వున్నట్టూ, కలలు గన్నాడు, కుప్పుసామి.

భళ్ళున తెల్లవారింది. పొద్దు నడినెత్తికి ఎక్కింది

ఆఫీసు వెనుక వున్న నూతి దగ్గరికి- మనిషి చచ్చిపోయాడు మనిషి చచ్చిపోయాడు- అనుకుంటూ జనం పరుగులు దీసి వెళ్తుండగా, తనూ వెళ్లాడు కుప్పుసామి.

అప్పటికే శవాన్ని నూతిలోంచి బయటికి తీసి, పడుకోబెట్టారు. చుట్టూ ఆఫీసు జనాలు గుమికూడి గుసగుసగా కబుర్లు చెప్పుకుంటున్నారు వాళ్ల మధ్యలో శంభులింగాన్నీ, ఆ ఆఫీసర్నీ గుర్తుపట్టాడు కుప్పుసామి. అడ్డుగా నిల్చున్న జనాల్ని తొలగించుకుని, మెడని రిక్కించి చూసాడు కుప్పుసామి

బాగా వుబ్బి భయంకరంగా అయిన నాగయ్య శవాన్ని చూసి, ఉలిక్కి పడ్డాడు కుప్పుసామి. కడుపులో దేవినట్లయింది. నరాల్ని భయంకరంగా మెలి దిప్పినట్లనిపించింది మనస్సుని కత్తుల్తో ముక్కలు ముక్కలుగా కోసినట్లు బాధ పెనవేసింది. గిజ గిజ కొట్టుకున్నాడు.

'మీ బ్రతుకులు బండలుగాను మీ నోళ్లల్లో మట్టిగొట్ట మీ యమ్మా కడుపులుగాల! ఎందుకురా మీ బ్రతుకులూ? సాటి మనిషిని చంపిన ఈ పాపం ఊరికే పోదురా ఒరేయ్ మీరు దిక్కు లేని చావు ఛస్తార్రా. వెధవ నాయాళ్లలారా! ధూ.!' అని శివమెత్తినట్లు గంతులు వేసి, బండ బూతులు తిట్టాడు కుప్పుసామి. అక్కడ చేరిన ఏ ఒక్కడి నోరూ, తెరుచుకుని అతన్ని సమాధాన పరచటానికి ప్రయత్నం చేసే సాహసం చేయలేదు.